క్లుప్తంగా

హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీలోని 9వ వార్డు కోటారెడ్డి నగర్‌లోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు (బీసీడీడీ) ఆ వార్డులోని అర్హత కలిగిన వారు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ శర్మిష్ట తెలిపారు. పదో తరగతి పాస్ అయి ఉండి 01-07-2022 నాటికి 21 సంవత్సరాలు నించి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. వివాహిత స్థానిక మహిళగా ఉండాలని చెప్పారు.

గుడ్లూరు: ఆయా పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కామేశ్వరి మంగళవారం తెలిపారు. మొగుళ్ళూరు(ఎస్సీ), అడవిరాజు పాలెం (బీసీ-డి) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

గృహాల పరిశీలన

సీఎస్‌పురం (పీసీపల్లి): సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్ అన్నారు. కోవిలంపాడు సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం కోవిలంపాడు, మిట్టపాలెం, శీలంవారిపల్లిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరై గృహాలను పరిశీలించారు.

ప్రవేశాల కోసం అధ్యాపకుల పర్యటన



కళాశాల ఉన్నతీకరణ ప్రచార పత్రాలు అందజేస్తున్న జేజేసీ అధ్యాపకులు

పామూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తి వెంకట రమణయ్య ఇంటర్‌లో ప్రవేశాల కోసం క్యాంపెయినింగ్ ప్రారంభించారు. మంగళవారం పామూరుతో పాటు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలో ప్రచార పత్రాలను అందజేశారు. కళాశాలలో అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారని, ఎంపీసీ, బైపీసీలో ఇంగ్లీష్, తెలుగు మీడియం ఉందని, సీఈసీ, హెచ్ఈసీలో తెలుగుమీడియం ఉందన్నారు.

5 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వెలిగండ్ల: మండలంలోని రామలింగాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామస్వామి దేవాలయంలో 5 నుంచి 7వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వలంటీర్ నియామకం

వెలిగండ్ల: మండలంలోని హుస్సేన్‌పురం పంచాయతీ పద్మాపురంలో వలంటీర్‌ను నియమించినట్లు ఎంపీడీఓ టి. సుకుమార్ మంగళవారం తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఉన్నతాధికారులు అడిగిన సమాచారాన్ని వెంటనే అందించాలన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కనిగిరి రూరల్: క్రీడల్లో యువత రాణించాలని బీటీపీ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు అన్నారు. పట్టణంలో గార్లపేట రోడ్డులో దద్దాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దద్దాల నారాయణల సహకారంతో ఏర్పాటు చేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. సుమారు 42 క్రికెట్ టీంలు పాల్గొన్నాయి. ఏఎంసీ డైరక్టర్ దద్దాల రాములు, గోబ్బిళ్ల శ్రీను, చలువాది నారాయణ, డి. ప్రసాద్, పెద్దన్న పాల్గొన్నారు.

5న కల్యాణ మండపం ప్రారంభం

కందుకూరు అర్బన్: కందుకూరు శ్రీ స్కందపురి జనార్దనస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ఈనెల 5 సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రారంభిస్తారని ఈఓ బైరాగి చౌదరి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

2210 బేళ్ల విక్రయం

కందుకూరు: మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం కందుకూరు-1వ వేలం కేంద్రంలో 1217 బేళ్లు విక్రయానికి ఉంచగా వాటిలో 1136 బేళ్లు, కందుకూరు-2వ వేలం కేంద్రంలో 1158 బేళ్లకు గాను 1074 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లో అత్యధిక ధర రూ. 200 రాగా, కనిష్ట ధరలు రూ. 160, రూ. 150 వచ్చాయి.

కొండపిలో 1056 బేళ్ల కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, చతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాల రైతులు మంగళవారం 1190 బేళ్లు తీసుకు రాగా 1056 కొనుగోలయ్యాయి. 104 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. అత్యధిక ధర కేజీ రూ.200, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.195.92 పలికిందని వేలం కేంద్ర నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీసీపల్లి, (కనిగిరి రూరల్): పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలం మురిగమ్మి సచివాలయం పరిధిలోని మారెళ్ల పంచాయతీ, అయ్యలూరి వారిపల్లిలో మంగళవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. సచివాయల వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే తెచ్చినట్లు చెప్పారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. ఎమ్మెల్యే బుర్రా ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని తక్షణ సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గడప గడపకు మెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. తొలుత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు చెరుకూరి సతీష్ చౌదరి, సర్పంచ్ పరిమి వెంకట్రావ్, మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, అంబటి మోహన్, వెలుతుర్ల నాగిరెడ్డి, కసిరెడ్డి ఓబుల్ రెడ్డిలు స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. ఎంపీపీ అత్యాల జషన్య, జెడ్పీటీసీ లక్ష్మీకాంతంరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు జయరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జి. బొర్రారెడ్డి, ఓకేరెడ్డి, ఎంపీటీసీలు కొండారెడ్డి, భాస్కర్, సర్పంచ్ శ్రీను, సూరా మాల్యాద్రి, మూలే శ్రీనివాసులరెడ్డి, శీలం సుదర్శన్, మేకల మాల్యాద్రి, రమేష్ పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

హనుమంతునిపాడు: ఆరోగ్య ఉపకేంద్రలో పని చేసే ఎంఎల్ హెచ్‌పీలు సమయ పాలన పాటించకుండా విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిప పై శాఖ పరమైన చర్యలు తప్పవని డాక్టర్ మూరక ప్రతాపు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆస్పత్రిలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఏఎన్ఎంలు ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు తీసుకోవాల్సిన నివారణ చర్యలు జాగ్రత్తల పై ప్రజలకు అవగాహన కల్పించాలి. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపకేంద్రాలు 1 గంటకే తాళాలు వేసి వెళ్లి పోతున్నారని గ్రామాల్లో ప్రజలు నుంచి వార్తలు వస్తున్నాయి. సీహెచ్ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆశ వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ అధికారి

పొగాకు సరాసరి ధర రూ.195



వేలంలో పాల్గొన్న వ్యాపారులు, రైతులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు 946 బేళ్లు తీసుకురాగా 891 కొనుగోలయ్యాయి. 55 బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ. 160, సరాసరి రూ.195.05 పలికింది. వేలంలో మొత్తం 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

వలేటివారిపాలెం: మాదక ద్రవ్యాలు, నాటు సారా నివారణ సదస్సులో భాగంగా కందుకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం ఎస్సై బి. మహేంద్ర నాయక్ అధ్వర్యంలో పోలినేనిపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని కలిగి ఉండటం, సేవించడం, రవాణా చేయడం చట్ట రీత్యా నేరమన్నారు. పిల్లల ప్రవర్తనలో ఏదైనా డ్రగ్స్ సంబంధిత అనుమానం ఉంటే అధికారులు వెంటనే సమాచారం ఇవ్వాలని, అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోకి వచ్చే నేరాలపై సమాచారం ఇవ్వాలని తెలిపారు. 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫిర్యాదులను ఇవ్వొచ్చు తెలియజేశారు. సబ్ ఎస్సై డి. మౌలాలి, స్థానిక మహిళ పోలీస్ ప్రసన్న పాల్గొన్నారు.



సదస్సులో పోలీసు అధికారులు

డాకా పిచ్చిరెడ్డి కుమార్తెను ఆశీర్వదించిన ఎంపీ మాగుంట



గౌతమిని ఆశీర్వదిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు

కొండపి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె గౌతమి వివాహం సందర్భంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆశీర్వదించారు. మంగళవారం కె.ఉప్పలపాడులోని పిచ్చిరెడ్డి నివాసానికి చేరుకున్న ఎంపీ వివాహ ఏర్పాట్లపైనా చర్చించారు. పీడీసీసీబీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, కొండపి జెడ్పీటీసీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్మన్ మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి, డాకా కోటిరెడ్డి, బెల్లం సత్యన్నారాయణ తదితరులు పాల్గొని గౌతమిని ఆశీర్వదించారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల మంజూరు

కందుకూరు: ప్రతి హాస్పిటల్‌లో వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం. పెంచలయ్య అన్నారు. కందుకూరు డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం మంగళవారం స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, అనీమియా ముక్తభారత్ కార్యక్రమం, వ్యాధి నిరోధక టీకాల అమలు, సంక్రమిత వ్యాధుల సర్వే, ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా హెల్త్‌కార్డుల ఐడీ నంబర్ల వివరాలు వంటి వాటిపై వైద్యాధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలు 100 శాతం అమలు చేసి సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలో గల ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతి కుటుంబాన్ని సందర్శించి అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి షుగరు, బీపీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రతి నెలా అవసరమైన మందులను ఇవ్వాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ ప్రియంవధ, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటప్రసాద్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్, డాక్టర్ సునీల్, కేపీ స్వాతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ పెంచలయ్య

ఉత్సాహంగా చెన్నకేశవుని వసంతోత్సవం



పూజలందుకుంటున్న స్వామి వారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చెన్నకేశవస్వామికి వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారి ఉత్సవమూర్తులను పీఠంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఏకాంత సేవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

● ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ శోభిక

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీలోని సంతోష్‌నగర్, ఐఎస్ఆర్ నగర్‌లోని సచివాలయాలను మంగళవారం సబ్ కలెక్టర్ శోభిక ఆకస్మికంగా తనిఖీ చేశారు హాజరు పట్టిక, రికార్డులను, అర్జీల రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సచివాలయంఉద్యోగులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. కమిషనర్ ఎస్. మనోహర్, తహసీల్దారు సీతారామయ్య పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

కందుకూరు రూరల్: సాంకేతిక విద్యను నేర్చుకోవడం వలన ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంపీడీఓ విజయశేఖర్ అన్నారు. కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ మస్తానయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవ సభలో మాట్లాడారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ఎంపీపీ సుశీల

నేటి నుంచి ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో వెలసిన విజయ గణపతి దేవస్థానంలో బుధవారం నుంచి విజయ గణపతి, ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు రాంప్రసాద్‌శర్మ తెలిపారు. 3వ తేదీ బుధవారం విఘ్నేశ్వర పూజ, యాగశాల సంస్కారం, 4వ తేదీ గురువారం యంత్రాభిషేకం, రుద్రహోమం, 5వ తేదీ ఉదయం 10.42 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ, ధ్వజ స్తంభ, శిఖర, కలశ, బలిపీఠం, ఆదిగణపతి, అంత్య మారుతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నటు ఆయన వివరించారు.



పెద్దదోర్నాలలో వెలసిన విజయ గణపతి ఆలయం

సస్పెన్షన్ ఉత్తర్వులపై స్టే

ముండ్లమూరు: స్థానిక సచివాలయంలో పనిచేస్తున్న మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే) శాంతి ప్రియ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించింది. వివరాలు.. మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి శాంతిప్రియ విధులకు యూనిఫాం లేకుండా హాజరు కావటం, పోలీస్ బందోబస్తు విధులు నిర్వహించటం లేదంటూ ఎస్ఐ సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్పీ మలికాగర్గ్ ఏప్రిల్ 4న ఆమెను సస్పెండ్ చేశారు. ఆ ఉత్తర్వులపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఆమె యథావిధిగా సచివాలయంలో విధులకు హాజరు కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

కొమరోలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. బేస్తవారపేట మండలం గలిజేరుగుళ్ల గ్రామానికి చెందిన వెంకటయ్య (70)కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన భార్య తిరుపతమ్మతో గిద్దలూరు వైద్యశాలకు వెళ్లేందుకు తన స్వగ్రామంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు కొమరోలు చేరే సరికి వెంకటయ్య బస్సులో కూర్చోలేక పోతుండటంతో కొమరోలులోని వైద్యశాలలో చూపించాలనే ఉద్దేశంతో తిరుపతమ్మ తన భర్త వెంకటయ్యను బస్సు నుంచి కిందకు దించింది. 2 నిమిషాల్లోనే ఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటయ్య గుండెపోటుతో మృతి చెందాడు. తన బంధువుల సహకారంతో వెంకటయ్య మృతదేహాన్ని స్వగ్రామం గలిజేరుగుళ గ్రామానికి తరలించారు.



వెంకటయ్య మృతదేహం

వైఎస్సార్ బీమా పేద వర్గాలకు వరం

● చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పేద వర్గాల వారికి వైఎస్సార్ బీమా పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో మృతి చెందిన ఎస్‌కే జిలానీ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ. 10వేల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం మంగళవారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ పసుపులేటి దీపలు అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పేద వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు పి. అరుణోదర్, సచివాలయ సెక్రటరీ సురేష్, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు జి. అబ్రహం లింకన్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తక్షణ పారిశుద్ధ్య చర్యలపై అవగాహన కల్పించారు. మున్సిపల్, ఆరోగ్య సిబ్బందితో ఫినాయిల్, బ్లీచింగ్ చెల్లించారు. మురిసీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. మాజీ ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, అరుణోదర్, శానటరీ సెక్రటరి సులోచన, ఆశ వర్కర్లు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



నగదు అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని

లింగసముద్రం: ఉపాధి హామీ పథకం పనుల్లో ప్రతి కుటుంబానికి 100 రోజులు పని దినాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు చెప్పారు. మంగళవారం ఏపీఓ అబ్దుల్లాతో కలిసి మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కనీసం 4 గంటలు పని చేస్తే రోజుకు వేతనం రూ.272 వస్తుందని చెప్పారు. టెంట్‌ను ఏర్పాటు చేయడం, మంచినీరు, మజ్జిగను ఏర్పాటు చేయడంతో ఎంపీడీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హాజీపురం సచివాలయ పరిధిలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ, 20 గ్రూపులతో జరుగుతున్న ఉపాధి పనులు ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు మంగళవారం తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ ఎర్రంరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం: కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శేషుబాబు

దారి వివాదంపై విచారణ

లింగసముద్రం: మండలంలోని వీఆర్ కోటలో తన ఇంటికి వెళ్ళే దారిలో నడవనివ్వడం లేదని కందుకూరు సబ్‌కలెక్టర్‌కు వెలుగు శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సుధాకరరావు మంగళవారం విచారణ చేపట్టారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో శ్రీనివాసరావు నివాసం ఉంటున్న ఇంటి వరకు ఇటీవల పంచాయతీ అధికారులు గ్రావెల్ తోలినట్లు చెప్పారు. శ్రీనివాసరావును అడ్డగించిన వారు ప్రస్తుతం గ్రామంలో లేరని హైదరాబాద్ వెళ్ళినట్లు తెలిసిందన్నారు. పంచాయతీ తీర్మానం, రికార్డులను పరిశీలించిన అనంతరం సబ్‌కలెక్టర్‌కు విచారణపై నివేదిక పంపిస్తామని చెప్పారు. అనంతరం విశ్వనాథపురంలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. వీఆర్ఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ కోటలో విచారణ చేస్తున్న తహసీల్దార్ సుధాకరరావు

వైభవంగా మోహినీ ఉత్సవం



పామూరు: అలంకరణలో పోలేరమ్మ

హనుమంతునిపాడు: మండల పరిధి నారాయిపల్లిలో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మంగళవారం మోహినీ ఉత్సవం, గ్రామోత్సవం వైభవనంగా నిర్వహించారు. కోలాటం, భజన కార్యక్రమాలు ఆలరించాయి. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, బీసీ సెల్ మండల నాయకులు కేతిబోయిన వెంకట కాశయ్య, మండల రైతు సంఘ అధ్యక్షులు శ్యామల సాంబిరెడ్డి, ఎంపీటీసీ టి.తిరుపతరెడ్డి మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

పామూరు: గ్రామ దేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. చన్నీటి స్నానమాచరించి పొంగళ్లను ఏర్పాటు చేసుకుని అమ్మవారి ఆలయానికి తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు కరిసి పంటలు పండాలని ప్రార్థించారు.

పీసీపల్లి: మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో దేవతామూర్తుల విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగనున్నాయి. ఆలయంలో పోలేరమ్మ, బంగారమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం, గురువారం హోమాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగ తీర్చిదిద్దారు.



కమ్మవారిపల్లిలో సర్వాంగ సుందరంగా సిద్ధమైన ఆలయం

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ నోటీసులు

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెం పంచాయతీ పరిధిలో నిధుల దుర్వినియోగంపై గ్రామస్తుడు జీవీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అధికారులు గతంలో విచారణ చేపట్టారు. ఆ మేరకు సర్పంచి, కార్యదర్శికి మంగళవారం నోటీసులు జారీ చేశారు.